సాక్షి
శ్రీకాకుళం
గురువారం, 6, జూన్, 2024



'చిత్ర'వధ చేస్తారు..

సోషల్ మీడియాలో పోస్టు చేసే ఫొటోలతో జాగ్రత్త. చాలా మంది మోసపోతున్నారు.

- 8లో



సచివాలయానికి తాళం

టెక్కలిపాడులో ఓ టీడీపీ నాయకుడు సచివాలయానికి తాళం వేశాడు. పోలీసుల రాకతో వివాదం సద్దుమణిగింది.

- 8లో

నేటి నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా పడిన పాలిసెట్-2024 పాలిటెక్నిక్ ప్రవేశాల కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ప్రారంభం రోజు మూడో తేదీన వాయిదా పడ్డ ధ్రువీకరణ పత్రాలు పరిశీలన 108001 నుంచి చివరి ర్యాంకు వరకు పరిశీలించనున్నారు. నవరించిన షెడ్యూల్ మేరకు ఏడో తేదీ నుంచి 10వ తేదీ వరకు కళాశాలలు, బ్రాంచ్ ఆప్షన్ల ఎంపిక, 11వ తేదీన ఆప్షన్ల మార్పు, 13వ తేదీన సీట్ల అలాట్‌మెంట్, 14వ తేదీ నుంచి 19వ తేదీ వర కు కళాశాలలకు సెల్ఫ్ రిపోర్టింగ్, 14వ తేదీన మొదటి సెమిస్టర్ క్లాస్‌వర్క్ ప్రారంభించనున్నారు.

న్యూస్‌రీల్

'ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి'



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం

గార: ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలుచేయాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం డిమాండ్ చేశారు. ఆయన బుధవారం రామచంద్రాపురం పంచాయతీలో పని ప్రదేశాల వద్ద ఉపాధి హామీ వేతనదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు పట్టెడు అన్నం పెట్టే ఉపాధి హామీ పథకానికి మరిన్ని నిధులు కేటాయింపు చేయాలన్నారు. 200 రోజులు పనిదినాల కల్పనతో పాటు వేతనం రూ. 600 చేయాలన్నారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు గంగరాపు ఈశ్వరమ్మ, నారాయణమ్మ, పి.హేమలత, జె.పార్వతి, కె.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవికి సూరిబాబు రాజీనామా



అంధవరపు సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్‌గా 2020లో పదవిలో చేరానని, అప్పటి నుంచి కులం అభ్యున్నతికి, అభివృద్ధికి అహర్నిశలు శ్రమించానని అంధవరపు సూరిబాబు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు, నవరత్నాలను కులంలో అర్హులైన వారందరికీ అందేలా గత నాలుగేళ్లుగా కృషి చేశానన్నారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవిస్తూ తన చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు. రాజీనామా పత్రాన్ని స్పెషల్ చీఫ్ సెక్రటరీ బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విజయవాడ వారికి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీ జిల్లా ముఖ్య నాయకులకు, కళింగ వైశ్య, భేరి వైశ్య కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ప్రజల వెంటే ఉంటా..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ప్రజల వెంటే తాను ఉంటానని, ఎవరూ అధైర్యపడద్దని, ప్రజాసేవ చేయడానికి మీతోపాటు కలిసి పనిచేస్తానని, ప్రజాతీర్పును గౌరవిస్తానని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బుధవారం పాతపట్నంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో కలవడానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. తన కోసం పనిచేసిన సర్పంచ్‌లకు, నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని కార్యకర్తలకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, మరింత ఉత్సాహంతో పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తానన్నారు.

ప్రజా తీర్పును గౌరవిద్దాం



గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కోసం, తన కోసం పనిచేసి ఓట్లు వేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్లలో చేసిన అభివృద్ధిలో తన వెంట నడిచిన వారిని ఎప్పటికీ మర్చిపోలేనని, గెలిచినా.. ఓడినా.. తాను ప్రజల కోసమే పని చేస్తానని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు.

అమాత్య యోగం ఎవరికో..?



- మంత్రి పదవులపై మొదలైన చర్చ
- సీనియర్ రేసులో కింజరాపు అచ్చెన్నాయుడు
- తానేమి తక్కువ కాదనే స్థాయిలో కూన రవికుమార్
- వెలమ, కాళింగ సామాజిక వర్గాలకు తప్పక ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి
- జిల్లాలో ఒకరికే మంత్రి పదవిస్తే వీరిలో ఎవరికి?
- కేంద్ర క్యాబినెట్ బెర్త్‌పై ఆశతో ఉన్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సార్వత్రిక ఎన్నికల క్రతువు ముగిసింది. 80 రోజుల ప్రహసనం పూర్తయ్యి ఎన్నికల ఫలితాలు వచ్చేశాయి. ఇప్పుడంతా ప్రభుత్వ ఏర్పాటు, కేబినెట్ కొలువు దీరడమే మిగిలి ఉంది. దీంతో అందరి దృష్టి జిల్లాలో ఎవరెవరికీ మంత్రి యోగం దక్కుతుందో అన్నదానిపైనే పడింది. కొత్తగా ఏర్పాటవుతున్న చంద్రబాబు క్యాబినెట్‌లో బెర్త్ కోసం ఎవరికి వారే ఆశలు పెట్టుకుంటున్నారు. వారిలో ప్రధానంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పేర్లే చర్చకు వస్తున్నాయి. ఇక, ఎన్డీఏ భాగస్వామ్యం కావడం వల్ల కేంద్ర క్యాబినెట్‌లో కూడా టీడీపీలో కొందరికీ మంత్రి పదవులు దక్కుతాయి. ఆ అవకాశం హ్యాట్రిక్ విక్టరీ సాధించిన కింజరాపు రామ్మోహన్‌నాయుడికి వస్తుందన్న ఆశలు భారీగానే ఉన్నాయి.

సార్వత్రిక ఎన్నికలకు మార్చి 15వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వచ్చింది. మే 13న పోలింగ్ జరిగింది. ఈ నెల 4వ తేదీన లెక్కింపు పూర్తయ్యింది. ఈ ఎన్నికల్లో కూటమి విజయబావుటా ఎగురవేసింది. ఎనిమిది అసెంబ్లీ స్థానాలతో పాటు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ఇప్పుడు కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం, దాని విధి విధానాల మేరకు పనిచేసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడందరి దృష్టి మంత్రులెవరు అవుతారన్న దానిపైనే పడింది. జిల్లాలో హ్యాట్రిక్ విక్టరీతో ఆరు సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా కింజరాపు అచ్చెన్నాయుడు, వరుసగా మూడు సార్లు గెలిచిన ఎమ్మెల్యేగా బెండాళం అశోక్, రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వారిలో కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి ఉన్నారు.

అచ్చెన్నకే పెద్దపీట..

సామాజిక వర్గాల వారీగా చూస్తే వెలమ సామాజిక వర్గం నుంచి ఒకరికి, కాళింగ సామాజిక వర్గం నుంచి ఒకరికి మంత్రివర్గంలో చోటు కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది. అదే స్థాయిలో జిల్లాలో ఎక్కువగా ఉన్న కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇక, సీనియర్ల కోటాలో ఎమ్మెల్యేగా ఉన్న ప్రతి సారి మంత్రి పదవి ఆశించి భంగపడ్డ గౌతు శ్యామ్ సుందర్ శివాజీ కుమార్తె శిరీషను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ లెక్కన తొలుత వెలమ సామాజిక వర్గాన్నే తీసుకుంటే ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు కింజరాపు అచ్చెన్నాయుడిది. గతంలో మంత్రిగా పనిచేయగా, ప్రస్తుతం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇక, రెండో పర్యాయం ఎమ్మెల్యేగా ఎన్నికైన బగ్గు రమణమూర్తికి మంత్రి పదవి ఇచ్చేంత ప్రాధాన్యత లేదని పార్టీ వర్గాలే అనుకుంటున్నాయి. ఇక తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన గొండు శంకర్‌కు అదే గొప్ప పదవిగా భావించాలే తప్ప మంత్రి పదవి ఆశించేంత పరిస్థితి లేదని చెప్పుకోవాలి. ఈ లెక్కన చూస్తే వెలమ సామాజిక వర్గం నుంచి కింజరాపు అచ్చెన్నాయుడికే పెద్ద పీట వేయాల్సి ఉంటుంది. అధిష్టానం వైఖరిలో మార్పు ఉంటే తప్ప ఆయనకు దాదాపు ఖాయమయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి.

కాళింగ కోటాలో కూనకు దక్కే అవకాశం

జిల్లాలో ఒకరికే మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే టీడీపీ రాజకీయం రసవత్తరం కానుంది. కీలకమైన వెలమ సామాజిక వర్గానికివ్వాలా? కాళింగ సామాజిక వర్గానికా? అన్న చిక్కుముడి తప్పక ఉంటుంది. వెలమ సామాజిక వర్గానికే ఇవ్వాల్సి వస్తే అచ్చెన్నాయుడికే దాదాపు ఇచ్చే అవకాశం ఉంది. కాళింగ సామాజిక వర్గానికి ఇవ్వాల్సి వస్తే రెండు సార్లు గెలిచి, గతంలో పార్టీ విప్‌గా పనిచేసి, ఇటీవల ఎన్నికల వరకు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన కూన రవికుమార్‌కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. మూడు సార్లు గెలిచారని పరిగణనలోకి తీసుకుంటే ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెండాళం అశోక్‌పై ఆలోచన చేసే అవకాశం ఉంది. కానీ, టీడీపీ రాజకీయాలు శాసిస్తున్న వారిగా చూస్తే కూన రవికుమార్‌కే అగ్రతాంబూలం ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యాప్త సమీకరణాల నేపథ్యంలో జిల్లాలో ఒకరికే మంత్రి పదవి ఇవ్వాలని భావిస్తే మాత్రం సామాజిక వర్గ చిచ్చు రేగక తప్పదు. వెలమ సామాజిక వర్గానికిస్తే కాళింగులకు అనాయ్యం చేశారని, కాళింగులకు ఇస్తే వెలమలకు ముఖ్యంగా సీనియరైన కింజరాపు అచ్చెన్నాయుడికి మొండి చేయి చూపారని, అన్యాయం చేశారని ఆ సామాజిక వర్గం అనుకోక తప్పదు. జిల్లాలో ఇద్దరికి మంత్రి పదవులిస్తేనే ఆ రెండు సామాజిక వర్గాలకు న్యాయం చేసినట్టు అవుతుంది. లేదంటే ఒకరికి మంత్రి పదవి, మరొకరికి గతంలో మాదిరిగా విప్ ఇచ్చి సర్దుబాటైనా చేసి చేతులు దులుపుకోవచ్చు. ఈ సమయంలో అటు కాపుల నుంచి, ఇటు గౌతు ఫ్యామిలీ నుంచి గాని మంత్రి పదవి ఆశించే అవకాశం ఉండదు. జిల్లాలో ఎక్కువగా కాపులున్నప్పటికీ ఇతర జిల్లాల సమీకరణాల నేపథ్యంలో ఈ జిల్లా నుంచి ఎన్నికైన ఏకైక ఎమ్మెల్యేకు అవకాశం వచ్చే ఛాన్స్ లేదు. ఇక, గౌతు ఫ్యామిలీని తీసుకుంటే తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేగా శిరీషకు నచ్చ చెప్పి సమర్థించుకోవడానికి అవకాశం ఉంది.

ఎంపీ రామ్మోహన్ తెరపైకి వస్తే...

ఎన్డీఏలో టీడీపీ భాగస్వామ్యం కావడం, ఆ పార్టీ నుంచి గెలిచిన హ్యాట్రిక్ ఎంపీగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిలవడం, చంద్రబాబుకు నమ్మకస్తుడిగా ఉండటంతో కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పిస్తారేమోనన్న చర్చ జోరుగా నడుస్తోంది. దివంగత కింజరాపు ఎర్రంనాయుడు వారసుడిగా రాజకీయ ప్రవేశం చేసిన రామ్మోహన్‌నాయుడు వరుసగా విజయం సాధించడమే కాకుండా కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలిచారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే అప్పుడు జిల్లా సమీకరణాలపై ప్రభావం చూపుతుంది. ఇటు రాష్ట్ర మంత్రిగా బాబాయ్ అచ్చెన్నాయుడికి, అటు కేంద్రమంత్రిగా అబ్బాయ్ రామ్మోహన్‌నాయుడికి చోటు కల్పిస్తే ఒకే సామాజిక వర్గం నుంచి ఇద్దరికీ అగ్రతాంబూలం ఇస్తారా? అన్న సామాజిక వివాదం చోటు చేసుకునే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వెలమ సామాజిక వర్గం నుంచి ఒకరికే ఇవ్వాలనుకుంటే రాష్ట్ర కేబినెట్‌లో అచ్చెన్నాయుడికి ఇవ్వాలి. కాదనుకుంటే కేంద్ర కేబినెట్‌లో రామ్మోహన్‌కు చోటు కల్పించాలి. ఈ సమయంలో బాబాయ్, అబ్బాయ్‌లో ఒకరికి మొండి చేయి తప్పదు. ఈ సమీకరణాల నేపథ్యంలో ఏమవుతుందో, ఎవరికి యోగం దక్కుతుందో చూడాలి.

పొలిటికల్ టాక్

ప్రజాతీర్పును శిరసా వహిస్తా

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్దేశకులని, ప్రజానీకం ఇచ్చిన అంతిమ తీర్పునకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనని, దాన్ని తాను కూడా శిరసావహిస్తున్నానని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన బుధవారం తన గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో గత ఎన్నికల్లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలను అమలు చేశామని చెప్పారు. పార్టీలకు, ప్రాంతాలకు, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేసినప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్పందన లభించకపోవడం బాధాకరమని అన్నారు. ఆమదాలవలస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసేలా కృషి చేశానని పేర్కొన్నారు. అయినప్పటికీ నియోజకవర్గ ప్రజానీకం ఇచ్చిన తీర్పును శిరసా వహిస్తానన్నారు. ఎన్నికల ఫలితాలు నిరాశ పరిచాయన్నారు. ఎన్నికల్లో గెలిచిన కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్లలో ఎన్నో హామీలను తాము నిలబెట్టుకున్నామని, రాబోయే ఐదేళ్లు కూడా కూటమి అభ్యర్థులు హామీలు అమలు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున కష్టపడిన ప్రతి నాయకునికి, కార్యకర్తకి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే కాలంలో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. వచ్చే ఐదేళ్లు ప్రజల సమస్యల మీద ఎప్పటిలాగానే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని విజ్ఞప్తి చేశారు. మళ్లీ కలిసికట్టుగా అందరం పార్టీ కోసం పనిచేద్దామని తమ్మినేని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామమూర్తి, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైఎస్ఆర్ సీపీ సీనియర్ నాయకులు కోట గోవిందరావు, కోట వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సహకారానికి ధన్యవాదాలు

- పోలింగ్, కౌంటింగ్ అత్యంత సజావుగా ముగిశాయి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్



కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా నిర్వహించినందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే జిల్లాలో గెలుపొందిన వారికి అభినందనలు తెలియజేశారు. జిల్లాలో నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ పరిశీలకులు శేఖర్ విద్యార్థి, తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహిల్, మాలతుస్ ఎస్.సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజీజ్ శుక్లదాస్‌లు, జిల్లాలో పోలింగ్ నిర్వహణ, స్ట్రాంగ్ రూమ్ భద్రత అలాగే కౌంటింగ్ ఏర్పాట్లలో భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్ దొర, డాక్టర్ భరత్ నాయక్, అప్పారావు, సి. హెచ్. రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, ఎన్నికల అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహణకు సహకరించిన అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, రాజకీయ పార్టీలు, సంస్థలు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సహాయ సహకారాలు అందజేసిన ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాల్లో మంగళవారం ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించినట్లు పేర్కొన్నారు.

మొక్కే దిక్కు



- పర్యావరణాన్ని కాపాడాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

కాలుష్య కోరల నుంచి బయటపడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని మనం కాపాడితే–అది మనల్ని కాపాడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ ప్రకృతిలో సమతుల్యత కోల్పోవడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నామని తెలిపారు. అలాంటి సమస్యను అధిగమించాలంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని సూచించారు.

– శ్రీకాకుళం పాతబస్టాండ్

ఇదేం మాయ.. ఓట్లు వేసినా ఓటమా?!



ఎన్నికల ఫలితాలు చాలా మందిని ఆశ్చర్యపరిచాయి. సామాన్యుల నుంచి నాయకుల వరకు అంతా విస్మయానికి గురయ్యారు. స్కూళ్లు బాగు చేసి, పేదలకు ఆర్థికంగా తోడుగా నిలిచి, గ్రామాల్లో సామాన్యుల ఆత్మ గౌరవాన్ని నిలిపిన వైఎస్సార్‌సీపీకి పోలైన ఓట్లను చూసి చాలామంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, పేదలు, రైతులు వైఎస్సార్ సీపీకి తోడుగా ఉన్నారని, కానీ వారి ఓట్లు ఏమయ్యాయో అనుమానంగా ఉందని అంటున్నారు. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు. –సాక్షి నెట్‌వర్క్



అన్ని రౌండ్లలో ఒకేలా పెరగడమేమిటి



ఎన్నికల ఫలితాలు చూస్తున్నంతసేపు అన్ని రౌండ్లలో ఒకేలా పెరగడమేమిటి అన్న ది అనేక అనుమానాలను గురిచేస్తుంది. మా పంచాయతీలో చాలా మంది ఫోన్లు ద్వారా, కలిసిన వాళ్లంతా వైఎస్సార్ సీపీకి ఓటేశాం అని చెబుతూనే ఇలా అవ్వడమేమిటి అని అడుగుతున్నారు. గ్రామాల్లో చాలా మందికి ఇప్పటికీ ఏమీ అర్థం కావడం లేదు. చాలా పథకాలు అవినీతి లేకుండా ప్రతి ఇంటికి అందాయన్నది అందరికీ తెలుసు. ఎందుకిలా జరిగిందో అందరూ ఆలోచించాలి.

– యాళ్ల నారాయణమూర్తి, సతివాడ, గార మండలం

ఏదో మాయ జరిగింది



ఆమదాలవలస మున్సిపాలిటీలో అన్ని వార్డులలోని ప్రజలంతా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారు. మేము మా కుటుంబాలతో కలిసి ఓట్లు వేశాం. కానీ ఏం జరిగిందో తెలీదు. ఇలా మేము ఫ్యాను గుర్తుకు వేసిన ఓట్లు ఏమయ్యాయో తెలియదు. ఆశ్చర్యంగా ఉంది. ఏదో మాయ జరిగిందనిపిస్తోంది. దీనిపై పెద్దలు ఆలోచించాల్సి ఉంది.

– బొడ్డేపల్లి రమేష్‌కుమార్, ,ఆమదాలవలస

కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం



ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్నో లోపాలు ఉన్నట్టు అర్థమవుతుంది. సంక్షేమ పథకాలు అందుకున్న వారంతా ఓటు వేస్తే ఫలితాలు ఇంత దారుణంగా ఉండవు. రైతులు, మహిళలు ఎక్కువ మంది ఓటేశారు. ఈ లోపాలపై కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాను.

– ఎచ్చెర్ల శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రీకాకుళం రూరల్ మండలం

ఓటు వేశాం.. లెక్క తప్పింది



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాలవారి కోసం అనేక సంక్షేమ పథకాలు అందించింది. పథకాల ద్వారా మేలు జరిగిందని సంతోషంగా వైఎస్సార్ సీపీకి ఓటు వేశారు. ఓట్లు లెక్కింపు జరిగిన తర్వాత మా ఊరిలో ఓట్లు తక్కువగా వచ్చాయి. ఇన్ని తక్కువ ఓట్లు ఎలా వచ్చాయో.. ఎందుకు వచ్చాయో అర్థం కావటం లేదు. ఓట్లు తగ్గటం పట్ల మాకే నమ్మకం కలగటం లేదు.

– పెనుమజ్జి విష్ణుమూర్తి, యంబరాం, ఎల్.ఎన్.పేట

ఎన్నికల ఫలితాల్లో ఏదో జరిగింది..



ఎన్నికల కౌటింగ్ ప్రక్రియ అనంతరం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో ఏదో మతలబు జరిగే ఉంటుంది, ఎందుకంటే రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి అందించని సంక్షేమ పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఇంత తక్కువ ఓట్లు రావడం విస్మయానికి గురి చేస్తోంది. రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు గెలిచిన స్థానాల్లో ఇంత తేడా ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. దీని బట్టి ఈవీఎంలలో ఏమైనా టాంపరింగ్‌లు జరిగాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

– పిలక రాజలక్ష్మి, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

అంతు పట్టడం లేదు



ఎన్నికల ఫలితాలు అంతుపట్టడం లేదు. ప్రతి ఒక్కరికి మేలు చేసిన ప్రభుత్వాన్ని ప్రజలు ఇంతగా ఓడించే పరిస్థితి లేదు. ఎన్నికలు జరిగిన ఈవీఎంలలో తేడా ఉన్నట్లు తెలుస్తుంది.

– రెడ్డి పాపయ్య, కేశవలస, సారవకోట మండలం

ఫలితాలపై ఆందోళన చెందుతున్నాం



మేము, మా కుటుంబాలు, ప్రజలంతా కచ్చితంగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు వేశారు. భారీ మెజారిటీతో గెలుస్తామని ఊహించాం. ఊహే కాదు నిజం కూడా అవ్వాలి. మెజారిటీలో తేడాలు ఉంటాయోమో కాని గెలుపులు ఖాయమనుకున్నాం. ఎందుకంటే ప్రజలు సంక్షేమ పథకాలు తీసుకుంటూ ప్రతి ఇంటి వద్ద మాతో ఆప్యాయంగా మాట్లాడారు. ఈవీఎంలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనే ఆలోచన వస్తోంది. ఈ ఫలితాలు మాత్రం మసి పూసి మారేడు కాయ చేసినట్లు ఉన్నాయి.

– దుంపల శ్యామలరావు, ఆమదాలవలస

టీడీపీకి మెజార్టీ రావడం ఆశ్చర్యంగా ఉంది



నరసన్నపేట మండలం పోతయ్యవలసలో 668 ఓట్లు ఉన్నాయి. 623 ఓట్లు పోలింగ్ అయ్యాయి. మా గ్రామంలో 70 శాతం వైసీపీనే. ఇక్కడ టీడీపీకి ప్రచారం చేసే వారే లేరు. ఉన్న కొంత మంది వాళ్ల ఓటు వాళ్లు వేసుకుని వెళ్లిపోయారు. పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ వాళ్ల ఆచూకీ కూడా ఆ రోజు లేదు. అలాంటిది ఈ పోలింగ్ కేంద్రంలో టీడీపీకి 75 ఓట్ల మెజార్టీ వచ్చింది. వాస్తవానికి ఈ మెజార్టీ వైఎస్సార్‌సీపీకి రావాలి. ఇప్పుడు టీడీపీకి మెజార్టీ రావడం అనుమానంగా ఉంది.

– కనపల శేఖర్ రావు, పోతయ్యవలస, నరసన్నపేట

ఫలితాలు ఊహించలేదు



రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతో ఐదేళ్లలో గ్రామాల స్వరూపం మారింది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు చేరాయి. గ్రామాలను ప్రభుత్వం పట్టుకొమ్మల్లా తీర్చిదిద్దింది. అధిక సంఖ్యలో మహిళలు ఓట్లు వేశారు. ఫలితాలు మాత్రం ఆశ్చర్యాన్ని కలిగించాయి.

– బల్లాడ హేమమాలినీ రెడ్డి, ఎచ్చెర్ల

క్లుప్తంగా

వేంకటేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.2.70 లక్షలు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ ఆదాయాన్ని లెక్కించామని ఈఓ టి.రవి తెలిపారు. వీటిని లెక్కించగా రూ.2.70 లక్షల మేరకు ఆదాయం వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు సర్వేశ్వరరావుతో పాటు ఆలయం ధర్మకర్త పాట్నూరు వీరభద్రస్వామి, ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాసింజర్ రైళ్లు రద్దు


కాశీబుగ్గ: పలాస–విశాఖపట్నం మధ్య నడిచే పాసింజర్ రైలు, విశాఖపట్నం–పలాస మధ్య నడిచే పాసింజర్ రైళ్లను గురువారం రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అదేవిధంగా విశాఖపట్నం–గుణుపూర్ మధ్య నడిచే పాసింజర్ రైలు, గుణుపూర్–విశాఖపట్నం–గుణుపూర్ మధ్య నడిచే పాసింజర్ రైలు, గుణుపూర్ విశాఖకు నడిచే పాసింజర్ రైలు రద్దు చేసినట్లు సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

చిత్రవధ చేస్తారు..

- జిల్లాలో పాదరసంలా పాకుతున్న ఫొటో మార్ఫింగ్ మోసాలు
- ఆన్‌లైన్ నుంచే ప్రొఫైల్ పిక్‌లు తస్కరించి బ్లాక్‌మెయిల్ చేస్తున్న దుండగులు
- పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్న బాధితులు
- వ్యక్తిగత సమాచార గోప్యత అవసరమంటున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ :

- శ్రీకాకుళంలో నివసిస్తున్న ఓ ప్రైవేటు ఉద్యోగికి ఓ వ్యక్తికి వాట్సాప్ కాల్ చేశాడు. కాల్ కట్ కావడంతో వీడియో కాల్ చేసి తాను నగ్నంగా కనిపించడమే కాకుండా ఆమె నగ్న చిత్రాలు కూడా బయట పెడతాననిబెదిరించాడు. అలా చేయకూడదంటే రూ.50వేలు ఇవ్వాలని బెదిరించాడు.
- శ్రీకాకుళం ఒకటో పట్టణ పరిధిలోని ఓ సంపన్న వర్గానికి చెందిన వృద్ధుడికి ఓ అమ్మాయి ఉన్నట్టుండి వీడియో కాల్ చేసింది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక న్యూడ్ వీడియో కాల్ చేయడం మొదలుపెట్టింది. ఆ వీడియోలన్నీ రికార్డు చేసి రూ.2 లక్షలు ఇవ్వాలని బెదిరించింది. దీంతో ఆ వృద్ధునికి రూ.2 లక్షలు ఇవ్వక తప్పలేదు. తర్వాత పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది.
- శ్రీకాకుళం పరిధిలోనే తండేవలసలో కూడా విదేశాల్లో కూలీ పనులకెళ్లి విశ్రాంతికని ఇండియాకొచ్చిన ఓ వ్యక్తి దగ్గర రూ. 1.50 లక్షలు ఓ యువతి, ఇద్దరు యువకులు కాజేశారు.





మోసం జరిగే విధానాలు..

సెక్స్ టార్షన్ సంబంధిత నేరాలు అనేక రకాలుగా జరుగుతాయి. ఇంటర్నెట్‌లో ఉన్న డేటింగ్ వెబ్‌సైట్/ యాప్స్‌లలో సైబర్ నేరస్తులు ఆకర్షణీయమైన ఫేక్ ప్రొఫైల్‌లను ఉంచుతారు. ఎవరైనా వీరి ఉచ్చులో పడితే పై మాదిరిగా బ్లాక్‌మెయిల్ చేసి దోచుకుంటారు. కొన్నిసార్లు బాధితునికి నేరస్తునిపై పూర్తి నమ్మకం కుదరగానే వారితో నీ పేరు మీద ఫ్లాట్/హౌస్ కొంటున్నానని, కానీ వారి డబ్బులు స్టాక్ మార్కెట్‌లో ఇరుక్కున్నాయని, డౌన్ పేమెంట్ కోసం వారి అకౌంట్‌కు మనీ ట్రాన్స్‌ఫర్ చేయాల్సిందిగా కోరి అందినకాడికి దోచుకుంటారు.

- ఇచ్ఛాపురానికి చెందిన ఓ బ్యాంకు చిరుద్యోగికి ఆన్‌లైన్ గేమింగ్ ఆడటం హాబీ.. ఈ క్రమంలో తెలియని లింక్ క్లిక్ చేయడంతో అతని బ్యాంకు ఖాతా, సోషల్ మీడియా అకౌంట్ల వివరాలు, వ్యక్తిగత సమాచారమంతా తస్కరణకు గురైంది. రెండు రోజులయ్యాక అతనికి వాట్సాప్‌లో తన నగ్న చిత్రాలు రావడంతో అవాక్కయ్యాడు. ఈ తంతుతో అతనికి రూ. లక్ష వదిలింది.

ఇవికొన్నే. జిల్లాలో ఇలాంటిఘటనలు తరచూ జరుగుతున్నాయి. స్మార్ట్ ఫోన్లు వచ్చాక, మనుషుల బతుకులు సోషల్ మీడియాకు ఎక్కినాక ఎవరికీ



సైబర్ అలెర్ట్

రక్షణ లేకుండా పోయింది. వాట్సాప్‌లలో పెట్టే డీపీలు, సోషల్ మీడియాలో పోస్టు చేసే ఫొటోలను తీసుకుని, వాటిని మార్ఫింగ్ చేసి కొందరు దుండగులు డబ్బులు కాజేస్తున్నారు. వాట్సాప్ నంబర్లు తీసుకుని వీడియో కాల్స్ చేస్తూ ఇంకొందరు బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నారు. ఇందులో కొందరు మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. చాలా మందిడబ్బులు ఇచ్చేసి గుట్టుగా ఉండిపోతున్నారు.

వ్యక్తిగత సమాచార గోప్యత..

వందలాదిగా ఫొటోలను చాలామంది సోషల్ మీడియాలో పోస్టు చేస్తుంటారు. ప్రొఫైల్ పిక్స్‌కు లాక్ పెట్టుకోరు. ముఖ్యంగా మహిళల విషయంలో ఇది అంత మంచి పని కాదని పోలీసులు సూచిస్తున్నారు. ఈ ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. మన ఎఫ్‌బీ, వాట్సాప్, ఇన్‌స్టా, ఇతర ఆన్‌లైన్ ఖాతాలే కాక మన వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచితే మంచిదని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటర్నెట్‌లో ఉండే డేటింగ్ వెబ్‌సైట్ / యాప్స్, ఫేక్ మ్యాట్రిమోనియల్ సైట్లలో ఉండే ఫేక్ ప్రొఫైల్స్‌పై అప్రమత్తంగా వ్యవహరించాలి.
- అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్ ఛాటింగ్ లేదా వీడియో కాల్స్ వంటివి చేయకూడదు.
- మనపర్సనల్ ఫొటోలు, వీడియోలు ఎవరితోనూ షేర్ చేయకూడదు. చాలాసార్లు మనకు బాగా తెలిసిన వ్యక్తే ఇలాంటి నేరాలకు పాల్పడుతుంటారు.
- సైబర్ నేరస్తుల నుంచి మన డేటా లేదా ఐడెంటిటీ థెఫ్ట్ కాకుండా సోషల్ మీడియా అకౌంట్స్‌కు స్ట్రాంగ్ పాస్‌వర్డ్స్ ఉంచుకోవాలి.
- టీనేజీ పిల్లలు ఇలాంటి సైబర్ మోసాలకు తొందరగా ఆకర్షితులవుతారు. వారికి ఈ విషయాలన్నీ అర్థమయ్యేలా వివరించాలి.

కాల్స్, మెసేజీలకు స్పందించకండి



మన ఫోన్‌కు వచ్చే అన్‌నోన్ కాల్స్, మెసేజ్‌లకు ఎట్టి పరిస్థితుల్లో స్పందించకపోతే మంచిది. స్పామ్‌కాల్స్ (ఎరుపు రంగులో), బ్లాక్ కాల్స్ తెలుసుకుంటే మేలు. సాధ్యమైనంతవరకు మన సోషల్ మీడియా అకౌంట్లకు ప్రైవసీ లాక్ యూజ్ చేయాలి. బ్యాంకు ఖాతా, ఓటీపీ తదితర వివరాలెవరికీ చెప్పకూడదు. ఇలాంటి కేసుల్లో బాధితులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు.

– బలివాడ గణేష్, ఎస్‌ఐ, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్, శ్రీకాకుళం

పిక్చర్ మార్ఫింగ్ ..

సైబర్ నేరస్తులు ఐడెంటిటీ థెఫ్ట్ ద్వారా బాధితుని ఫొటోలు దొంగిలించి వాటిని మార్ఫింగ్ చేస్తారు. ఇంటర్‌నెట్/సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అప్‌లోడ్ చేస్తామని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బును దోచు కోవడం లేదా లైంగికంగా వేధించడం చేస్తారు. వాట్సాప్‌లు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సైబర్ నేరస్తులు బాధితులను ఆకర్షించి వారితో సెక్స్ చాట్స్, న్యూడ్ వీడియోకాల్స్‌కు ప్రేరేపించి వాటిని రికార్డు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేస్తామని, ఫ్యామిలీ/ఫ్రెండ్స్‌కు పంపిస్తామని బ్లాక్ మెయిల్ చేసి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తారు. హనీ ట్రాప్‌లో ఇది ఒక కొత్త తరహా నేరం. ఈ సైబర్ నేరాల్లో స్త్రీలే ఎక్కువగా బాధితులైనప్పటికీ చాలాచోట్ల మగవారు కూడా బాధితులైన ఘటనలు ఉన్నాయి.



టెక్కలిపాడు సచివాలయానికి తాళం

- టీడీపీ ప్రభుత్వం వచ్చిందని సిబ్బందితో దుర్భాషలు
- ఎస్‌ఐ చొరవతో సద్దు మణిగిన వివాదం



టెక్కలిపాడు సచివాలయం

జలుమూరు: టెక్కలిపాడు సచివాలయానికి అదే గ్రామానికి చెందిన వాన రామదాస్ మంగళవారం రాత్రి తాళాలు వేయడం చర్చనీయాంశంగా మారింది. సాధారణ ఎన్నికల ఫలితాలు టీడీపీకి అనుకూలంగా రావడంతో మంగళవారం ఉదయం నుంచే గ్రామానికి చెందిన టీడీపీ యువకులు సచివాలయ సిబ్బందిపై రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారు. గ్రామంలో ఈ ప్రభుత్వ భూమి గ్రామానికి చెందిన వాన రామదాసు ఆక్రమణలో ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇదే స్థలంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం తదితర భవనాలు నిర్మించారు. టీడీపీ గెలిచిందని తెలిశాక రామదాసు సచివాలయానికి తాళం వేశారు. బుధవారం ఉదయం విధులకు వచ్చిన సచివాలయ సిబ్బంది సచివాలయానికి తాళాలు వేసి ఉండడంతో ఆరా తీశారు. సమాచారం తెలుసుకున్న మహిళా పోలీస్ తట్ట స్వాతి ఎస్‌ఐకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వీఆర్‌ఓ రాజు, ఎస్‌ఐ మధుసూదనరావులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇలా ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేయడం నేరమని గట్టిగా హెచ్చరించి తాళాలు తీసి సిబ్బంది విధులకు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. దీంతో వివాదం సద్దు మణిగింది. టీడీపీ నాయకులు ఈ విధంగా సచివాలయ సిబ్బంది విధులకు అడ్డుతగలడం మంచిది కాదని ధర్మాన బువాజీ, బండి ఎర్రన్నలు విమర్శిస్తున్నారు.

7న ఏకలవ్యలో ఇంటర్ కౌన్సెలింగ్



ఎం.రాధాకృష్ణ, ప్రిన్సిపాల్,

పాతపట్నం: జిల్లాలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ సీట్ల భర్తీ కోసం ఈ నెల 7వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.రాధాకృష్ణ బుధవారం తెలిపారు. భామిని(కొత్తూరు), మెళియాపుట్టి(పాతపట్నం) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో ఇంటర్మీడియెట్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 7వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు కొత్తూరులో నడుపుతున్న భామిని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు



అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీల విజేత విజయనగరం జట్టు

- అండర్-19 నార్త్‌జోన్ విజేతగా విజయనగరం జట్టు

టెక్కలి: జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో గల నెల 31 నుంచి జరుగుతున్న అండర్-19 నార్త్‌జోన్ క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం-విజయనగరం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 164 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన విజయనగరం జట్టు 40 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని సాధించి విజేతగా నిలిచింది. నిర్వాహకులు ఎస్.లాల్‌బహదూర్ తో పాటు కళాశాల పీడీ లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు. అలాగే క్రికెట్ పోటీల నిర్వాహణ కోసం మైదానాన్ని కేటాయించిన కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు, యాజమాన్యంకు జిల్లా క్రికెట్ సంఘం కృతజ్ఞతలు తెలిపింది.

విశ్రాంత ఆర్మీ జవాన్‌కు ఘన సత్కారం



విశ్రాంత ఆర్మీ జవాన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరు మండలం గూనభద్ర ఆర్ ఆర్ కాలనీకు చెందిన తలే వెంకటరావు ఆర్మీలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఉద్యోగ విరమణ పొందిన తలే వెంకటరమణ దంపతులను బుధవారం సర్పంచ్ పెదకోట సాదుబాబుతో పాటు కాలనీకు చెందిన పలువురు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన విధి నిర్వహణలో జరిగిన సంఘటనలు, అనుభవాలను వివరిస్తూ భావోద్వేగానికి గురయ్యారు.

సౌదీ అరేబియాలో చినవంక యువకుడు మృతి



మదనాల శంకర్(ఫైల్)

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం చిన వంక గ్రామానికి చెందిన యువకుడు, వలస కూలీ మదనాల శంకర్(32) బుధవారం తెల్లవారుజామున సౌదీ అరేబియాలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. ఈ మరణ వార్తతో శంకర్ కుటుంబం శోక సంద్రంలో మునిగింది. చేతికి అందిన ఒక్కగానొక్క కుమారుడి అకాల మరణంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. యువకుడు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా మృతుడు 4 నెలల కిందట ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని తల్లి కాంతమ్మ అనారోగ్యంతో ఏడాది కిందటే మృతి చెందారు. మృతునికి తండ్రి ఎం.సూర్యనారాయణ, సోదరి ఉన్నారు. శంకర్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మృతిని కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వివాహిత ఆత్మహత్య



వాన్నల రేవతి (ఫైల్)

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ పంచాయతీ ఎస్ ఎస్ కాలనీలో నివాసం ఉంటున్న వన్నాల రేవతి(27) బుధవారం ఇంటిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేవతి భర్త కృష్ణారావు స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సారవకోట మండలం కుమ్మరిగుంటకు చెందిన కృష్ణారావుకు పాతపట్నం మండలం పాచిగంగుపేటకు చెందిన రేవతితో తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిగింది. అయితే ఎప్పటి మాదిరిగానే కృష్ణారావు విధుల నుంచి మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చాడు. ఇంటిలోకి వెళ్లే సరికి రేవతి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించింది. దీంతో వెంటనే ఆమెకు కిందకు దించి స్థానికుల సహకారంతో స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. వీరికి ఆరేళ్ల వయసు గల కుమార్తె ఉంది. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ తెలిపారు.

ఒడిశాలో ఉద్దానం పనసకు గిరాకీ



వ్యాపారులు తోటల్లో నిల్వచేసిన పనస పండ్లు

కవిటి: ఒడిశాలో ప్రత్యేకమైన 'అంబో అమావాస్య' వేళ ఉద్దానం పనసకు మంచి గిరాకీ కనిపిస్తోంది. ఏటా సావిత్రి అమావాస్య వ్రతాలను చేసుకునే తమ అక్కచెల్లెళ్లకు అన్నదమ్ములు ఈ పండును కానుకగా ఇవ్వడం ఇక్కడ సంప్రదాయం. పనస, మామిడి, ఈతపండ్లు, తాటి మంజలు, దోసకాయలు ఇస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉద్దానం ప్రాంతంలో పనస పండ్లు కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో వ్యాపారులు తోటలకు వస్తున్నారు.

బస్‌పాస్‌ల కోసం కొత్త వెబ్‌సైట్

శ్రీకాకుళం అర్బన్: నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఆర్టీసీ ఇచ్చే రాయితీ బస్‌పాస్‌ల కోసం పాత వెబ్‌సైట్ స్థానంలో కొత్త వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలి పారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిధిలో ఎంఎస్‌టీ పాస్‌లపై తిరిగే ప్రయాణికులకు పాస్‌ల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్ అప్‌డేట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ వెబ్‌సైట్ ఈనెల 6, 7 తేదీల్లో పని చేయదని, 8వ తేదీనుంచి యథావిధిగా బస్ పాస్‌ల జారీ ప్రక్రి య కొనసాగుతుందని తెలిపారు. కొత్త విద్యా సంవత్సరానికి ఈనెల 12వ తేదీ నుంచి యథావిధిగా నూతన బస్‌పాస్‌లు జారీ చేసే ప్రక్రియను వినియోగంలోకి తెస్తామన్నారు. విద్యార్థి చదువుతున్న విద్యాసంస్థ నుంచి స్టడీ సర్టిఫికెట్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తీసుకుని ఆన్‌లైన్‌లో ఏపీఎస్‌ఆర్టీసీపాస్‌డాట్‌ఇన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకుని శ్రీకాకుళం, పలాస, టెక్కలి బస్ స్టేషన్‌ల లో గల బస్ పాస్ కౌంటర్‌ల వద్దకు వచ్చి రాయితీ/ఉచిత పాస్‌లను పొందవచ్చని తెలిపారు.

జిల్లాలో కూటమిదే పై చేయి

- గతం కంటే పెరిగిన ఓట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయం సాధించింది. జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ సీట్లలోను కూటమి అభ్యర్థులు గెలుపొందారు. గత ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమైన టీడీపీ ఈ ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలవడంతో అన్ని సీట్లు సాధించింది. గత ఎన్నికల్లో టెక్కలి, ఇచ్ఛాపురం మినహా జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందగా ఈ సారి పరాజయం ఎదురైంది.

- **శ్రీకాకుళం నియోజకవర్గం:** ఈ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీకి 64,570 ఓట్లు రాగా టీడీపీకి 1,17,091 ఓట్లు వచ్చాయి. 52,521 మెజార్టీ సాధించారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 84084 ఓట్లు వచ్చాయి. అప్పుడు ప్రత్యర్థి టీడీపీకి 78307 ఓట్లు వచ్చాయి.
- **ఆమదాలవలస:** ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 52,971ఓట్లు రాగా టీడీపీకి 88,003 ఓట్లు వచ్చాయి. ఆధిక్యం 35,032 ఓట్లు వచ్చాయి. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 77,897 ఓట్లు రాగా టీడీపీకి 63,906 ఓట్లు వచ్చాయి.
- **ఎచ్చెర్ల:** ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి 1,12,770 ఓట్లు వచ్చాయి. వైఎస్సార్‌సీపీకి 83,681 ఓట్లు రాగా బీజేపీకి 29,089 మెజారిటీ వచ్చింది. గతంలో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపొందారు. అప్పుడు టీడీపీకి 80,961 ఓట్లు రాగా వైఎస్సార్‌సీపీకి 99672 ఓట్లు వచ్చాయి.
- **టెక్కలి నియోజకవర్గం:** టెక్కలి గతంలోను, ఈ ఎన్నికల్లోను టీడీపీ గెలుపొందింది. ఈ సారి టీడీపీకి 1,07,923 ఓట్లు రాగా వైఎస్సార్‌సీపీకి 73,488 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 34,435 మెజార్టీ వచ్చింది. గతంలో టీడీపీ అభ్యర్థికి 87658 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 79,113 ఓట్లు వచ్చాయి.
- **నరసన్నపేట :** ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 70,580 ఓట్లు వచ్చాయి. టీడీపీ అభ్యర్థికి 99,951ఓట్లు వచ్చాయి. మెజారిటీ 29,371 ఓట్లు వచ్చాయి. గతంలో వైఎస్సార్‌సీపీకి 86,797 ఓట్లు రాగా, టీడీపీ అభ్యర్థికి 67,242 ఓట్లు వచ్చాయి.
- **పలాస:** ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 61,210 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థికి 1,01,560 ఓట్లు వచ్చి 40,350 ఓట్లు ఆధిక్యత సాధించారు. గతంలో పలాసలో వైఎస్సార్ సీపీకి 76603 ఓట్లు రాగా టీడీపీకి 60,356 ఓట్లు వచ్చాయి.
- **పాతపట్నం:** ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 62,925 ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థికి 89,452 ఓట్లు వచ్చి 26,527 ఆధిక్యత సాధించారు. గతంలో వైఎస్సార్‌సీపీకి 76941 ఓట్లు రాగా టీడీపీకి 61390 ఓట్లు వచ్చాయి.
- **ఇచ్ఛాపురం:** ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి 70829 ఓట్లు రాగా టీడీపీకి 1,10,612 ఓట్లు వచ్చాయి ఆధిక్యంలో 39,783 ఓట్లు వచ్చాయి. గతంలో ఇచ్ఛాపురంలో టీడీపీ అభ్యర్థికి 79,992 ఓట్లు రాగా వైఎస్సార్ సీపీ అభ్యర్థికి 72847 ఓట్లు వచ్చాయి.

'ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి'

శ్రీకాకుళం అర్బన్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏపీ ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ శివారెడ్డి, చౌదరి పురుషోత్తమనాయుడులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా ఏర్పడిన ప్రభుత్వానికి ఏపీ ఎన్‌జీఓ సంఘం తరపున శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించి అందరి మన్ననలు పొందాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సీపీఎస్ రద్దుకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఎంప్లాయీస్ హెల్త్‌స్కీమ్‌కు సంబంధించిన కార్డులు పనిచేసే విధంగా చూడాలని, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ భద్రతకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వలసల నివారణకు చర్యలు చేపట్టాలని, శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం దృష్టి సారించాలని, ఏపీ ఎన్‌జీఓ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు.